మహిళలకు చట్టాలపై అవగాహన

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ సభ్యులు

జైనూర్, జూన్ 6 : జైనూర్ మండల కేంద్రంలోని కుమ్రం భీం చౌరస్తాలో గల ఆటో స్టాండ్ వద్ద గురువారం ఆసిఫాబాద్ డివిజన్ షీ టీమ్ సభ్యులు మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. షీ టీమ్ సభ్యురాలు సునీత మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు గురైనట్లయితే వెంటనే షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీమ్‌లు పనిచేస్తున్నాయని, ఏదైనా అత్యవసరమైతే డయల్ 100, 8712670564లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఇన్‌చార్జి సునీత, సభ్యులు, శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో చేర్పించాలి

మంచిర్యాల డీఈవో ఎస్ యాదయ్య

జన్నారం పొనకల్‌లో జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నా డీఈవో యాదయ్య

జన్నారం, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది పిల్లలను చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మంచిర్యాల జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య చెప్పారు. గురువారం మండలంలోని పొనకల్ మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జయశంకర్ బడి బాట కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. జన్నారం మండలం అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలుస్తున్నదని, విద్యార్థుల అడ్మిషన్‌లలోనూ ప్రథమ స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం బడి బాట కార్యక్రమంలో భాగంగా పొనకల్ గ్రామంలోని పలు కాలనీల్లో ర్యాలీ తీశారు. అనంతరం కవ్వాల్, అక్కపెల్లిగూడలో అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో నడిమెట్ల విజయ్‌కుమార్, ఎంపీడీవో శశికళ, ఎంపీవో రమేశ్, కొండు జనార్దన్, ప్రధానోపాధ్యాయుడు జాజాల శ్రీనివాస్, కార్యదర్శి రాహుల్, అనిల్ పాల్గొన్నారు.

కళాయాత్రలో భాగంగా సైకిల్‌పై వెళ్తున్న పోచం

సామాన్యుడి అసామాన్య యాత్ర

లైవ్ డ్రాయింగ్‌లో నిమగ్నమైన పోచం

- లైవ్ డ్రాయింగ్ పేరిట దేశాన్ని చుట్టేసిన పోచం
- చేతిలో చిల్లిగవ్వ లేకున్నా.. నమ్ముకున్న కళ తో ప్రయాణం
- ఏడేళ్లలో 14 వేలకుపైగా లైవ్ పెయింటింగ్స్ వేసి రికార్డులు
- నేడు కన్యాకుమారిలో కళాయాత్ర ముగింపు సభ

మంచిర్యాల, జూన్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్ పట్టణానికి చెందిన ఎల్పుల రాజక్క-లచ్చయ్య దంపతుల కుమారుడు ఎల్పుల పోచం తను నేర్చుకున్న కళను విశ్వవ్యాప్తం చేసేందుకు లైవ్ డ్రాయింగ్ పేరిట దేశవ్యాప్త యాత్ర చేపట్టాడు. 2017 డిసెంబర్‌లో మొదలైన ఆయన ప్రయాణం నేడు కన్యాకుమారిలో ముగియనున్నది. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా 28 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాలను చుట్టివచ్చిన ఆ కళాకారుడిపై ప్రత్యేక కథనం.. ఎల్పుల పోచం చెన్నూర్‌లో ఇంటర్ వరకు చదువుకున్నాడు. ఆపై హైదరాబాద్‌లో బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేశాడు. అనంతరం ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చేశాడు. చిత్రకళా రంగంలో చేయి తిరిగిన పోచం తన కళకు దేశావ్యాప్త గుర్తింపు తీసుకురావాలని నిర్ణయించుకున్నాడు. లక్ష్యం ఉంటే ఎంతటి కష్టమైనా ఇష్టంగా చేయవచ్చనే సంకల్పంతో 2017 డిసెంబర్‌లో వారణాసిలో పూజలు చేసిన కశ్మీర్ నుంచి తన లైవ్ డ్రాయింగ్ కళాయాత్ర ప్రారంభించాడు. విద్యార్థులకు చిత్రలేఖనం, ట్యూషన్‌లు చెప్పి అలా వచ్చిన డబ్బుతో యాత్రను కొనసాగించాడు. ఇలా చేస్తూ పోతే దేశం మొత్తం తిరగడం చాలా సమయం పడుతుందని భావించి స్నేహితులు, గురువుల సహకారంతో ఒక్కో రాష్ట్రం తిరుగుతూ ఆ రాష్ట్ర చరిత్ర, సందర్శనీయ ప్రదేశాలను సందర్శిస్తూ వాటి చిత్రాలు గీస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించాడు. వెళ్లిన చోట ఆ ఊరిలోని గుడి, బడి, మసీదులలో ఆశ్రయం పొందాడు. స్థానికులు ఇచ్చిన ఆహారాన్ని తీసుకుంటూ ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తట్టుకుంటూ సుదీర్ఘ యాత్ర పూర్తి చేస్తున్నాడు.

2410 రోజులు 30700 కిలీమీటర్లు

2017లో మొదలు పెట్టిన యాత్ర 2410 రోజుల పాటు కొనసాగగా, తన యాత్రలో 30700 కిలోమీటర్లు పూర్తి చేశాడు. 28 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాలను సందర్శించిన పోచం ఆ ప్రాంతంలోని స్మారక కట్టడాలు, వారసత్వ ప్రదేశాలు, సంస్కృతి, సంప్రదాయాలను తన చిత్రాల ద్వారా బంధించారు. దేశంలోని ఎనిమిది జ్యోతిర్లింగాలు, తొమ్మిది అష్టశక్తి పీఠాలు, 24 సెంట్రల్ యూనివర్సిటీలు, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలను సందర్శించారు. ఇలా సందర్శించిన ప్రతి ప్రాంతంలోని చిత్రాలను గీచిన పోచన్న నేటి వరకు తన యాత్రలో 14 వేలకు పైగా లైవ్ పెయింటిగ్స్ వేశాడు. దూర ప్రాంతాలకు ట్రైన్ ద్వారానే ప్రయాణం చేసిన పోచం, ఆయా గ్రామాలను చుట్టి రావడానికి సైకిల్‌ను ఉపయోగించడం విశేషం.

అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు..

పోచన్న ఎవరికీ సాధ్యంకాని యాత్రను పూర్తి చేసి చరిత్ర సృష్టించాడు. ఆర్థికంగా లేకపోయినప్పటికీ తన గురువు సత్యనారాయణ, మద్దూరి రాజన్న-సుజాత సహకారంతో తన యాత్రను ప్రారంభించాడు. తన లక్ష్యాన్ని చేరుకునేందుకు నిర్విరామంగా కష్టపడుతూ ముందుకు సాగాడు. ఎవరేమనుకున్నా లెక్క చేయకుండా ముందుకెళ్లిన ఆయన, నేడు కన్యాకుమారిలో ఈ యాత్రను ముగించనుండడం విశేషం. తన యాత్రకు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, ప్రిస్టీజియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

లక్ష్యముంటే ఏదైనా సాధించవచ్చు

కళాయాత్ర ముగింపు పోస్టర్

ఆర్థికంగా లేకపోయినా నేర్చుకున్న కళను విశ్వవ్యాప్తం చేసేందుకు యాత్ర చేపట్టాను. చిత్రకళ ప్రాముఖ్యతను తెలుపుతూ, దేశాన్ని చుట్టిరావడం నా అదృష్టంగా భావిస్తున్నా. యాత్ర ప్రారంభంలో చిన్న చిన్న అడ్డంకులు ఎదురైనా నా గురువులు, నా స్నేహితులే నన్ను ముందుకు నడిపించారు. కరోనా సమయంలో నా యాత్ర నిలిచిపోయింది. రెండేళ్లు ఆగిపోయి మళ్లీ యాత్ర కొనసాగించాను. అనుకుంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించేందుకు నా యాత్రే నిదర్శనం. ఏడేళ్లపాటు కొనసాగిన సుదీర్ఘ యాత్ర నేడు కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్‌లో జరగనున్న కార్యక్రమంతో ముగుస్తుంది. ఈ కార్యక్రమం కూడా నా మిత్రుల సహకారంతో జరుగుతున్నందుకు సంతోషంగా ఉంది.

- ఏ పోచన్న, కళాకారుడు

సంకల్పానికి సగం బలం

- ఉద్యోగార్థులకు అండగా నిలుస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్
- ప్రభుత్వ గ్రంథాలయాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ
- అన్ని రకాల పుస్తకాలతో పాటు సదుపాయాల కల్పన
- ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌ల ద్వారా ఆన్‌లైన్ టెస్టులు
- గ్రూప్స్‌కు ప్రిపేరయ్యే 250 మందికి, డీఎస్సీకి ప్రిపేరయ్యే 150 మందికి ప్రోత్సాహం
- ఆదర్శంగా నిలుస్తున్న అధికారి

లక్ష్యసాధకులకు 'అక్షర' సాయం

ఆయనో ఐఏఎస్ అధికారి. గ్రంథాలయాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ.. ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పడుతున్న గ్రామీణ యువతకు చేయూతనిస్తున్నారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావడమేగాక సకల సదుపాయాలు కల్పించి అన్నీ తానై ముందుకు నడిపిస్తున్నారు. సర్కారు కొలువే లక్ష్యంగా పుస్తకాలతో కుస్తీ పడుతున్న వారికి 'అక్షర'సాయమందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. మన మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్..

లైబ్రరీలో ఉద్యోగార్థులకు సలహాలు, సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న యువకులు

మంచిర్యాల, జూన్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వ ఉద్యోగం సాధించడమంటే ఆశామాషీ కాదు. లక్షల మంది పోటీ పడితే వందల మందికే కొలువులు వస్తుంటాయి. అందుకోసం ఏళ్లకేళ్లు గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. అలాంటి వారికి మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీ రాహుల్ అండగా నిలుస్తున్నారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉద్యోగార్థులకు అన్నీ తానై నిలుస్తూ ముందుకు నడిపిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ కుటుంబం నుంచి ఐఏఎస్ సాధించిన ఆయన, తనలాంటి గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన నిరుద్యోగ యువతకు రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు. స్వయంగా జిల్లా అదనపు కలెక్టర్ వచ్చి సదుపాయాలు కల్పిస్తుండగా, ఉద్యోగార్థులు రెట్టింపు ఉత్సాహంతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు.

ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లతో చర్చలు జరిపి..

ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలోనే అదనపు కలెక్టర్ రాహుల్‌కు జిల్లాలోని గ్రంథాలయాలకు పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించింది. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యలో గ్రూప్స్ సహా డీఎస్సీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఉద్యోగార్థులకు ఇది అత్యంత కీలకమైన సమయమని గుర్తించిన ఆయన, అన్ని గ్రంథాలయాలను సందర్శించారు. జిల్లాలోని మూడు ప్రధాన లైబ్రరీల్లో గ్రూప్స్‌కు ప్రిపేరవుతున్న 250 మందిని, డీఎస్సీ ప్రిపేర్ అవుతున్న 150 మందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కష్టపడి చదువుతున్నా.. సరైన పద్ధతుల్లో ప్రిపేర్ కాలేకపోతున్నారని గుర్తించారు. 'ఏళ్ల తరబడి చదివి పరీక్షల్లో చేస్తున్న తప్పులేమిటి.. ఏ సబ్జెక్టులో వీక్ ఉన్నారు. ఇంకా బాగా స్కోర్ చేయాలంటే ఏం చేయాలి' అనే అంశాలపై ఉద్యోగార్థులు దృష్టి పెట్టడం లేదని తెలుసుకున్నారు. అందుకోసం ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న వారికి ఆన్‌లైన్ పరీక్షలు రాసే వెసలుబాటు కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రైవేటు ఇనిస్టిట్యూట్‌లతో సంప్రదింపులు చేశారు. ఈ క్రమంలోనే పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ప్రముఖ ఇనిస్టిట్యూట్లు ముందుకు వచ్చాయి. హైదరాబాద్ ఏఎస్‌కే ఇనిస్టిట్యూట్ గ్రూప్స్ చదువుతున్న వారికి, ఎస్‌అండ్‌ఎస్ ఇనిస్టిట్యూట్ డీఎస్సీకి ప్రిపేరవుతున్న వారికి ఉచితంగా టెస్ట్ సిరీస్(ఆన్‌లైన్ టెస్టులు) ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. ఈ మేరకు జిల్లాలోని 400 మంది ఉద్యోగార్థులకు ఆన్‌లైన్ లాగిన్స్ ఇచ్చిన సదరు ఇనిస్టిట్యూట్‌లు టెస్టు సిరీస్‌ను ప్రొవైడ్ చేస్తూ, ముఖ్యమైన అంశాలపై వీడియోలను సైతం అందజేస్తున్నాయి.

సదుపాయాల కల్పన..

ఉద్యోగార్థుల కోరిక మేరకు లైబ్రరీలకు అదనపు పుస్తకాలు తెప్పించారు. కలెక్టర్, జిల్లా అటవీశాఖ అధికారుల సహకారంతో పోటీ పరీక్షలకు సంబంధించి ప్రముఖ రచయితలు రాసిన పుస్తకాలను అందుబాటులోకి తేవడంతో పాటు మ్యాగజైన్లు, ఇంగ్లిష్ న్యూస్ పేపర్లను గ్రంథాలయాల్లో వేయిస్తున్నారు. ప్రతి పదిహేను రోజులకోసారి ఉద్యోగార్థులతో మాట్లాడి, వారికి కావాల్సిన పుస్తకాలను సమకూరుస్తూ వస్తున్నారు. పోటీ పరీక్షలు అయ్యే వరకు ఇది నిరంతర ప్రక్రియలా కొనసాగించాలని నిర్ణయించారు. ఇక పుస్తకాలతో పాటు ఇంటర్నెట్ సైట్స్‌లోనూ కావాల్సిన సబ్జెక్ట్‌ను చదువుకునేలా గ్రంథాలయాల్లో ఉచిత వై-ఫై సదుపాయం కల్పించారు. దాన్ని ఎవ్వరూ మిస్ యూజ్ చేసి, సమయం వృథా చేసుకోకుండా కొన్ని సైట్‌లను బ్యాన్ చేశారు. మంచిర్యాల లైబ్రరీలో చదువుకుంటున్న వారి కోసం కలెక్టర్ సహకారంతో 100 స్టడీ చైయిర్స్ సమకూర్చారు. అలాగే ఉద్యోగార్థుల కోరిక మేరకు మంచిర్యాల గ్రంథాలయ టైమింగ్స్ సైతం పెంచారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇది తెరిచే ఉంటుంది. ఇక చెన్నూర్, బెల్లంపల్లి లైబ్రరీలు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ప్రభుత్వ సెలవు దినాల్లో మూసివేసే లైబ్రరీలను ఇప్పుడు సెలవు రోజుల్లోనూ ఉద్యోగార్థులే స్వయంగా తెరచుకునే వెసలుబాటు కల్పించారు.

బోయపల్లిలో లైబ్రరీకి భవనం..

తాండూర్ మండలం బోయపల్లి గ్రామంలోని ఉద్యోగార్థులు కొన్నేళ్లుగా ప్రైవేట్ భవనంలో చదువుకుంటున్నారని తెలుసుకున్న అదనపు కలెక్టర్.. బోయపల్లికి వెళ్లి వారిని కలిశారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే ఓ ప్రభుత్వ పాఠశాల భవనానికి చిన్న చిన్న రిపేర్లు చేయించి ఉద్యోగార్థులు చదువుకునేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని మూడు ప్రధాన లైబ్రరీలతో పాటు బోయపల్లి యువతకు అవసరమైన పుస్తకాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి మున్సిపాలిటీల సహకారంతో మంచిర్యాల జిల్లా గ్రంథాయలయం, చెన్నూర్, బెల్లంపల్లి గ్రంథాలయాల్లో 100 రోజుల పాటు ఉచిత భోజన సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఉద్యోగార్థులకు సహకారమందిస్తాం

గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడుతున్న వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నాం. వారి కోసం ఏం కావాలన్నా చేస్తాం. సాధారణ కుటుంబం నుంచి వచ్చి ఉద్యోగం సాధిస్తే వారి కుటుంబాలు బాగుపడుతాయి. ఈ సంకల్పంతోనే ప్రభుత్వ గ్రంథాలయాల్లో చదువుకునే ఉద్యోగార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లోనూ ఇదే పద్ధతుల్లో ఉద్యోగార్థులకు మా సంపూర్ణ సహకారం అందిస్తాం.

- రాహుల్, మంచిర్యాల అదనపు కలెక్టర్

గాలి దుమారం

- గుండ్ల సోమారంలో లేచిపోయిన ఇండ్ల పై కప్పులు
- కాసిపేటలో రహదారిపై విరిగిపడ్డ చెట్లు

గుండ్లసోమారంలో ఇండ్ల మధ్య విరిగి పడిన కరంట్ స్తంభం

రోడ్డు పై విరిగిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు

నెన్నెల/కాసిపేట, జూన్ 6 : నెన్నెల మండలం గుండ్ల సోమారం గ్రామంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పది పెంకుటిళ్లు, రేకుల షెడ్ల పై కప్పులు లేచిపోయాయి. పలుచోట్ల చెట్లు విరిగి పడగా, కరంటు స్తంభాలు ఇండ్లపై పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దెబ్బతిన్న ఇండ్లను జడ్పీటీసీ సింగతి శ్యామల పరిశీలించారు. కాసిపేట మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలలతో కూడిన భారీ వర్షం పడగా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రహదారిపై భారీ వృక్షాలు విరిగి పడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాసిపేట రహదారిపై చెట్లు పడిపోవడంతో పంచాయతీ అధికారులు జేసీబీ సాయంతో తొలగించారు.

నమస్తే తెలంగాణ
విలేకరులు కావలెను
అర్హతలు :
- పాత్రికేయులుగా పనిచేయాలన్న ఉత్సాహం.
- మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన.
- తెలుగు భాషపై పట్టు ఉండి.. చక్కగా రాయగలగాలి.
- ఇంటర్ ఉత్తీర్ణత సాధించి.. 35 ఏళ్ల లోపు ఉండాలి.
- రిపోర్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారురాత పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూలకు హాజరుకావాలి.
- బయోడాటాతో రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోగలరు.

మంచిర్యాలకు కావలసిన కేంద్రాలు
1. మంచిర్యాల అర్బన్ 2. పాత మంచిర్యాల 3. గర్శిళ్ల 4. భీమిని 5. బెల్లంపల్లి రూరల్ 6. లక్షెట్టిపేట రూరల్

ఆసిఫాబాద్‌కు కావలసిన కేంద్రాలు
1. ఆసిఫాబాద్ 2. ఆసిఫాబాద్ రూరల్ 3. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ 4. కాగజ్‌నగర్ టౌన్ 5. కాగజ్‌నగర్ ఎస్పీఎం

రాతపరీక్ష తేదీ : 10-06-2024 (సోమవారం)
సమయం : ఉదయం 11 గంటలకు..
స్థలం : వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, బస్ డిపో వెనక, జాఫర్‌నగర్, మంచిర్యాల జిల్లా.
ఫోన్ నంబర్ : 91827 77502

మద్యం మత్తులో యువకుడి వీరంగం

- ఎలక్ట్రానిక్ షోరూంలో నగ్నంగా తిరిగిన వెంకటేశ్
- సోషల్ మీడియాలో వైరలైన వీడియో

మంచిర్యాల ఏసీసీ, మే 6 : మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించగా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని లడ్డ డిజిటల్ మల్టీ బ్రాండ్ మెగా ఎలక్ట్రానిక్ షోరూంలో బుధవారం నస్పూర్‌కు చెందిన వెంకటేశ్ మద్యం మత్తులో నగ్నంగా తిరుగుతూ వీరంగం సృష్టించాడు. వెంకటేశ్ బుధవారం షాపుకు వచ్చి టీవీ, ఫ్రిజ్ కొనుగోలు చేశాడని, బిల్లు కట్టిన తర్వాత టీవీ డెలివరీ కాకాముందే ఇంటికి వచ్చి ఫిట్ చేయాలని గొడవకు దిగినట్లు షాపు యజమాని సుమిత్ లడ్డ తెలిపారు. రెండు రోజులు పడుతుందని చెప్పినా వినకుండా షాపులోనే మద్యం సేవించి టేబుల్ మీదున్న వస్తువులను చిందరవందరగా పడేశాడని, అనంతరం షాపు ముందుకు వెళ్లి బట్టలు విప్పేసి నగ్నంగా వీరంగం సృష్టించాడని, పోలీసులకు సమాచారం ఇవ్వగా, అంతకుముందే అతడి కుటుంబ సభ్యులు వచ్చి తీసుకెళ్లారని ఆయన తెలిపాడు. కాగా, ఇందుకు సంబంధించిన వీడియో గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

9న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్‌పోటీలు

రెబ్బెన, జూన్ 6 : రెబ్బెన మండలం గోలేటిటౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఈ నెల 9న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలను రాష్ట్ర చెస్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్విస్ లీగ్ పద్ధతిలో అండర్-9, అండర్-13, అండర్-15 విభాగాలతో పాటు ఓపెన్ టూ ఆల్ క్రీడాకారులకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అండర్-9, అండర్-13 విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను హైదారాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 89781 46456 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679